## కథ

# వాళ్ళొస్తారు

''ఆంటీ'' అంటూ చొరవగా లోపలికి వచ్చారు బన్నీ, చింటూ.

''ఏంటి'' సామాన్లు సద్దుకుంటూనే అడిగాను నేను.

''ఇంకా సర్దడం పూర్తవ్వలేదా?'' చుట్టూ కలియచూస్తూ బన్నీ అడిగింది. ''లేదమ్మా'' చెమటని చేత్తో తుడుచుకుంటూ చెప్పాను.

''మొత్తం అంతా మీరే సర్దేస్తారా'' చింటూ ధర్మసందేహం.

''కాదులే. అంకుల్ ఆఫీసు నుంచి వచ్చాక, ఆ మూల బరువైన సామాన్లున్నాయి కదా వాటిని ఆయన సర్దుతారు'' చెప్పాను.

''వంట చెయ్యలేదా ఆంటీ'' అడిగింది బన్నీ.

''లేదు. అంకుల్ ఆఫీసుకెళ్తూ హోటల్లో చెప్పారు. కారేజ్ వచ్చింది. ఆయన కాంటీన్లో తింటారు'' అన్నాను.

''తిండానికేమీ లేవా'' సంయుక్తంగా అడిగారు బన్నీ, చింటూ.

''లేవు. సాయంత్రం అంకుల్ వచ్చాక ఏదైనా చేస్తాలే. ఇంతకీ మీరు స్కూల్‌కి వెళ్లలేదేం.''

''సమ్మర్ హాలీడేస్ ఆంటీ రెండ్రోజుల్నించీ'' బన్నీ.

''ఏ స్కూల్లో చదువుతున్నావమ్మా?'' అడిగాను.

''హోలీ ఏంజిల్స్ ఆంటీ. ఈ సందు చివర్నే ఉంది'' అంది బన్నీ.

''ఏం చదువుతున్నారు'' అడిగాను నేను.


## గరిమెళ్ల శ్రీరామమూర్తి


''నేను ఫిఫ్త్, తమ్ముడు ఫోర్త్'' చెప్పింది.

మా పిల్లలు కాలేజీ చదువుకొచ్చారు. అందుకని కాన్వెంట్ చదువుల గురించి మర్చిపోయాం. వంటసామాన్లు చక్కగా అమిరాయో లేదోనని దీర్ఘంగా చూస్తున్నాను నేను. పిల్లలు ప్రశ్నలు మానేసి ఆడుకోవడం మొదలుపెట్టారు. కొంతసేపటికి ఇల్లు కంపించేంత గట్టిగా అరుస్తూ అటూ, ఇటూ పరిగెడుతున్నారు. చింటూ ఫ్రిజ్ మీదకెక్కి దానిమీంచి దూకడానికి ప్రయత్నిస్తున్నాడు. కంగారుపడ్డాను నేను.

''ఒరే బాబూ పడతావు. భోజనాల వేళైంది ఇంటికెళ్లండి. మీ మమ్మీ కంగారుపడుతూ ఉంటుంది'' కొంచెం కంగారుగా అన్నాను.

''లేదాంటి. అమ్మ అప్పుడే భోజనం పెట్టదు. మీ టీవీ ఇంకా సెట్ చెయ్యలేదే'' ఎదురు ప్రశ్న వేసింది బన్నీ.

''ఆ. బహుశా రేపు కేబుల్ అబ్బాయి వస్తాడనుకుంటా'' అన్నాను.

''మీకు పిల్లలెంతమంది ఆంటీ?'' బన్నీ అడిగింది.

''ఇద్దరు'' అన్నాను.

''వాళ్లకి సెలవులు ఎప్పటినించి?'' బన్నీ అడిగింది.

''వాళ్లకి మేలోగానీ సెలువులు ఉండవమ్మా. ఒక పదిహేను రోజులిస్తారంతే'' అన్నాను.

''ఏం చదువుతున్నారాంటీ?'' అడిగింది బన్నీ.

''ఇద్దరూ ఇంటర్మీడియటే. అబ్బాయి ఇంటర్ సెకండియర్. అమ్మాయి ఫస్టియర్'' మళ్లీ ఆడుకోవడం ప్రారంభించారు.

''పాపా, చింటూ ఇక్కడున్నారా. ఇంటికి రండి'' అంటూ లోనికొచ్చింది గిరిజ.

''మీరు వీళ్ల మమ్మీయా? రండి రండి కూర్చోండి'' అంటూ అక్కడే ఉన్న ఒక కుర్చీ చూపించాను.


''వెళ్లిపోతానండీ. పిల్లల్ని తీసుకెళ్దామని వచ్చాను. ఇంకా వంట చెయ్యాలి'' అంటూ కూర్చుంది గిరిజ.

''మంచినీళ్లు తాగుతారా? కాఫీ ఇమ్మంటారా?'' మర్యాద కోసం అడిగాను నేను.

''ఏమీ వద్దండి. పక్కింట్లోంచేగా వచ్చింది'' అంది గిరిజ.

''మీ పిల్లలు భలే హుషారైనవాళ్లు సుమండీ'' చనువుగా అన్నాన్నేను.

అదేం పట్టించుకోనట్లుగా ''టీవీ ఇంకా బిగిం



చలేదా'' అడిగింది గిరిజ.

''లేదండీ. ఇంకా కేబుల్ అబ్బాయి రాలేదు'' అన్నాను.

''సరే ఉంటానండి. సీరియల్ మధ్యలో యాడ్స్ ఈపాటికి అయిపోయి ఉంటాయి'' కంగారుగా వెళ్లిపోయింది గిరిజ.

''అదే...పిల్లలూ మీరు కూడా వెళ్లండి. లేకుంటే మమ్మీ కోప్పడుతుంది'' అన్నాను.

''లేదాంటీ.. మమ్మీ ఇప్పుడెళితేనే కోప్పడుతుంది. సీరియల్ మధ్యలో డిస్టర్బ్ చేయకండి'' కళ్లు చక్రాల్లా తిప్పుతూ అన్నాడు చింటూ.

''మరి మీ భోజనం'' అడిగాను.

''ఏ మూడో అవుతుంది'' అంది బన్నీ.

''కాదాంటీ.. సోమవారం నుంచి బుధవారం దాకా రెండింటికే పెట్టేస్తుంది. గురువారం నుంచి శనివారం దాకా అయితే అదేదో ఇంకో సీరియల్ వస్తుంది కదా. అందుకని మూడవుతుంది'' పూర్తి టైంటేబిల్ చెప్పాడు చింటూ.

''నీకెలా తెలుసురా. మొన్నటిన్నించేగా సెలవులిస్తే'' క్రాస్ చేసింది బన్నీ.

''నిన్న మమ్మీ చెప్పిందిలే'' అన్నాడు వాడు.

''మరి ఆదివారం'' అన్నాను నేను.

''మమ్మీ ఎప్పుడూ ఆదివారం అసలు వంటే చెయ్యదు. డాడీ హోటల్ నించి కారేజీ తెస్తారు'' అంది బన్నీ.

''ఈవేళ గురువారం అంటే మూడింటికా మీ భోజనం. ఇంకా రెండు గంటలు టైం ఉంది'' గడియారం చూస్తూ అన్నాను.

నాకు ఆకలవుతోంది. హోటల్ క్యారియర్ నాకొక్కదానికే సరిపోతుంది. పిల్లల్ని అలా ఉంచి తినడానికి నాకు మనసొప్పలేదు. వీళ్లని పంపించేయాలి అనుకుని ''సరే మీర్రు వెళ్లండమ్మా. నాకింకా చాలా పని ఉంది'' అన్నాను.

''లేదాంటీ. ఇంటికెళితే అల్లరి చేస్తున్నారు. టీవీ చూడనివ్వట్లేదంటూ మమ్మీ కొడుతుంది.''

''మరి ఇందాకా మీ మమ్మీ మీకోసం ఇక్కడికొచ్చింది కదా?'' ప్రశ్నించాను.

''ఒకసారి చూసెళ్లడానికి వచ్చిందంతే'' అంది బన్నీ.

## అభిలాష

అగ్రహీరోలతో నటించి హిట్ కొడితే ఇక తిరుగుండదు అనుకుంటారు తారలు. అయితే తానొకటి తలిస్తే దైవం ఇంకోటి చేస్తుందన్నట్టు నరసింహుడు చిత్రంతో మంచి ఫామ్‌లోకి రావచ్చని భావించిన సెక్సీ సైరన్ సమీరారెడ్డి అంచనాలు బోర్లాపడ్డాయి. ఆ తర్వాతనైనా బావుంటుందేమో అనుకుంటే ఈమె ఈమధ్య నటించిన జై చిరంజీవ చిత్రం కూడా షరామామూలే అన్నట్టయింది. ఇక ఈమె ఆశలన్నీ ఎన్టీఆర్ జూనియర్ కొత్త చిత్రం అశోక్ పైనే ఉన్నట్టున్నాయి.



వాళ్ల అల్లరి అంతుతెగని ప్రవాహంలా సాగిపోయింది. నాకు వాళ్ల ముందే అన్నం తినాలనిపించలేదు. మూడుగంటల వరకు అరకొర సాగి మూడింటికి వాళ్లు వెళ్లిపోయారు. తరువాత నాకు భోజనం చెయ్యాలనిపించలేదు.

★ ★ ★

''వనజా ఏంటీ.. తలనొప్పిగా ఉందా?'' నుదుటి మీద చెయ్యేస్తూ అడిగాడు శ్రీధర్.

ప్రొద్దుటినుండి జరిగింది చెప్పాలనిపించింది నాకు. కానీ ఇంత చిన్న విషయాన్ని పెద్ద సమస్యగా చూపించాలనిపించలేదు. కానీ ముందు ముందు అదే పెద్ద సమస్యగా మారుతుందని ఆ క్షణంలో ఊహించలేకపోయాను.

''ఆ.. అవునండి. కొంచెం తలనొప్పిగా ఉంది'' అన్నాను.

''సరే రిలాక్సవ్వు. ఈ పూట కూడా బైటనే భోజనాలు కానిద్దాం. రేపటి నుంచి రొటీన్‌లో పడొచ్చు'' అనేసి శ్రీధర్ వెళ్లి బట్టలు మార్చుకుని ఇల్లు సర్దే పనిలో పడ్డాడు.

★ ★ ★

శ్రీధర్ ఆఫీసుకి వెళ్లిపోయాక హాల్లో సోఫాలో కూర్చుని తీరిగ్గా పుస్తకం చదువుకుందామనుకున్నాను.

''ఆంటీ ఇంకా టీవీ సెట్ చెయ్యలేదా'' అంటూ బన్నీ, చింటూ లోనికి ప్రవేశించారు. చదవాలనుకున్న పుస్తకం చేత్తోనే పట్టుకుని ''నాకు పెద్దగా టీవీ చూసే అలవాటు లేదురా. అందుకని సెట్ చెయ్యడం కొద్దిగా లేటయినా ఇబ్బందిగా ఉండదు'' అన్నాను.

''అస్సలు టీవీ చూడవా'' చాలా ఆశ్చర్యంగా ఏదో వింత జంతువుని చూస్తున్నట్లుగా చూస్తూ అన్నారు.

''అసలు చూడనని కాదు. అప్పుడప్పుడూ మాత్రమే చూస్తాను. అంకుల్ అయితే వార్తలు చూస్తారు'' చెప్పాను.

''మరి నీకెలా తోస్తుంది ఆంటీ. పాపం మమ్మీకి కూడా మొదట్లో ఏమీ తోచేది కాదట. అప్పుడేమో డాడీయే టీవీ చూడు అని చెప్పారట. ఇప్పుడు మమ్మీ ఇంచుమించు రోజంతా టీవీ చూస్తూనే ఉంటుంది'' అంది బన్నీ.

''నేను పుస్తకాలు చదువుకుంటాను. అప్పుడప్పుడు రాస్తూ ఉంటాను కూడా. ఆ విధంగా నా టైంని వినియోగించుకుంటాను'' చెప్పాను నేను.

''నువ్వు పుస్తకాలు చదువుతావా? ఏ క్లాస్ చదువుతున్నావాంటీ? స్కూల్‌కెళతావా?'' ఆశ్చర్యంగా అడిగాడు చింటూ.

నేను చిన్నబుచ్చుకోలేదు. ఎందుకంటే ప్రస్తుతం చదివే అలవాటు చాలామంది దినచర్య నుంచి దూరంగా జరిగిపోయింది.

''స్కూలు పుస్తకాల చదువు మాత్రమే చదువా? అవికాక మంచి పుస్తకాలు, జీవితానికి ఉపయోగపడే పుస్తకాలేవీ ఉండవా? మీరు ఏ పుస్తకాలూ చదవరా?'' ఒక్కసారిగా ప్రశ్నలు గుప్పించాను.

కొద్దిగా తత్తరపడి తేరుకుని ''పుస్తకాలు చదవాలా? క్లాస్ పుస్తకాలే బోర్ బోర్. ఇంకా చదవాలా? మా వల్లకాదు'' అన్నారు.

నేనింకా మాట్లాడాలనుకునేలోపు హాల్లో వాళ్లిద్దరూ ఆట మొదలుపెట్టారు. అంతే భూకంపం వచ్చినట్లు భ్రాంతి కలిగింది. చదివే పుస్తకం పక్కన పడేశాను.

''బన్నీ ఇలా రా'' గట్టిగా పిలిచాను.

''ఏంటాంటీ'' అంటూ వచ్చింది.

''నాకు చిన్నప్పటినుంచి నిశ్శబ్దంగా ఉండటం అలవాటు. మీరిలా అల్లరి చెయ్యకూడదు'' నింపాదిగా అన్నాను.

''మీ పిల్లలు అల్లరి చెయ్యరా ఆంటీ?'' ఆరిందాలా అడిగింది బన్నీ.

''వాళ్లూ చేసేవారు మీ అంత ఉన్నప్పుడు. కానీ మీ అంత కాదు. నేను చేయనిచ్చేదాన్నికాదు'' అన్నాను.


''ఒరేయ్. ఆంటీ అల్లరి చెయ్యొద్దంటోందా? బుద్ధిగా ఉండు'' అని నాకేసి చూసి ''వాడు ఇంట్లో కూడా ఇంతే ఆంటీ. అయితే మమ్మీకి కోపం వస్తే రెండు వాయిస్తుంది. గట్టిగా ఏడుస్తాడు. మళ్లీ మామూలే'' అని చెప్తూ మళ్లీ ఆటలో పడిపోయింది.

''నాకు తలనొప్పి మొదలైంది. వాడు 'కూ..' అని అరుస్తూ దాని చుట్టూ తిరుగుతుంటే నాకు రైళ్లు తల్లోనే పరిగెడుతున్నట్లుగా అనిపించింది.

మా ఇంటికి రావద్దని గట్టిగా చెప్పాలనిపించింది. కానీ పసివాళ్ల మొహాలు చూస్తుంటే అలా చెప్పబుద్ధేయలేదు. వాళ్ల మమ్మీకి 'మీ పిల్లల్ని మా ఇంటికి పంపకండి' అని చెప్పాలనిపించింది.

కొత్తగా ఈ కాలనీలోకి వచ్చాం. ఇక్కడి పరిస్థితులేవీ ఇంకా అవగతం కాలేదు. ఇంతలోనే అంత దురుసుగా చెప్పడం బాగోదేమో అనిపించింది.

''ఇలా మొహమాటపడితే ఎలా? సరే కొద్దిగా పరిస్థితులు ఆకళింపు చేసుకున్న తరువాత చెప్పొచ్చులే. అలాగ కాకపోతే వీళ్లు ఇక్కడికి రాకుండా నా మేధాశక్తిని ఉపయోగించి పాచిక వేయాలి అనుకున్నాను.




తరువాత రోజు కూడా వాళ్లు రావడం, ఇల్లు కిష్కింధ చేసి వెళ్లిపోవడం జరిగింది.

★ ★ ★

ఆదివారం ఆయన కూడా ఇంట్లో ఉన్నారు. కేబుల్ బాయ్‌ని తీసుకొచ్చి టీవీ కనెక్షన్ ఇప్పించారు.

టీవీ ఆన్ చెయ్యగానే మళ్లీ బన్నీ, చింటూ దూసుకొచ్చేశారు.

''హేయ్ టీవీ వస్తోంది'' అంటూ ఆయన చేతిలో రిమోట్ లాక్కుని ఛానెల్స్ చకచక మార్చేస్తోంది బన్నీ.

ఈ హఠాత్సంఘటనకి ఆయన నోట మాట రాలేదు. పిల్లల చనువు చూసి నిర్ఘాంతపోయారు.


''ఈ ఛానెల్ ఉంచు. బావుంటుంది. కాదు కాదు ఇది. కాదు వేరే ఛానెల్లో డాన్స్ ప్రోగ్రాం బావుంటుంది. అది పెట్టు'' అంటూ ఇద్దరూ వాదులాడుకోవడం ప్రారంభించారు.

ఆయన మొహం చూస్తే నాకు జాలేసింది.

''పిల్లలూ ఇలా రండి'' గట్టిగా పిలిచాను నేను వంటగదిలోంచి, పాచిక వేయాలి అనుకుని.

## దటీజ్ హృతిక్

**యువతరం హీరో హృతిక్ ఇప్పుడు తన ఇమేజ్‌కి తగ్గట్టుగా చిత్రాలతో పాటూ మంచి మంచి యాడ్స్‌లో కూడా కన్పిస్తున్నాడు. కోక్, తమరిండ్, జాన్ ప్లేయర్స్ కంపెనీలకు మంచి అంబాసిడర్‌గా మారిపోయాడు. ఒక పక్క సినిమాలతో బిజీగా ఉన్నా ఈ కంపెనీల యాడ్స్ కోసం తన ఖాళీటైంని కేటాయిస్తున్నాడు. అన్నట్టు జిమ్‌కి వెళుతూ స్మార్ట్‌గా కూడా తయారవుతున్నట్టున్నాడు. డబ్బెవరికి చేదు?**



''ఇక్కడ నీళ్లొలికాయి. ఆ క్లాత్ తీసుకుని క్లీన్ చెయ్యండమ్మా'' అన్నాను.

''ఆంటీ మీకు పనిమనిషి రాదా?'' అడిగింది బన్నీ.

''లేదమ్మా. మా ఇద్దరి కోసం ప్రత్యేకంగా పనిమనిషెందుకని పెట్టుకోలేదు'' అన్నాను.

బన్నీ బుద్ధిగా క్లాత్ తీసుకుని క్లీన్ చేసేసింది.

చిన్న చిన్న పనులు చాలా పురమాయించాను. అన్నీ చకచకా చేసుకుపోతున్నారు పిల్లలు.

వాళ్లు పనిచేసే తీరు చూసి ముచ్చటేసింది. ఆ వెనకే వాళ్లు మధ్యాహ్నం రెండు మూడింటిదాకా భోజనాలు చెయ్యరన్న సంగతి గుర్తొచ్చింది.

''బన్నీ...రోజూ లేటుగా భోజనం చేస్తే నీరసం రాదా?'' అడిగాను.

''లేదాంటీ. మార్నింగ్ డాడీ టిఫిన్ హోటల్ నుంచి తెస్తారు. అది తింటాం. అందుకనే ఆకలెయ్యదు.''

''మరి మీరు స్కూలుకెళ్లేప్పుడు లంచ్

టైంకి ఇబ్బందుండదా? కుతూహలంగా అడిగాను.

''స్కూల్ వర్కింగ్ డేస్‌లో అయితే మమ్మీ రైస్ కుక్కర్ పెట్టేస్తుంది. డాడీ కర్రీకార్నర్ నుండి కర్రీ తెస్తారు'' చెప్పాడు చింటూ.

ఎదిగే వయస్సులో ఇలా ఉండకూడదనిపించింది. కనీసం యాడ్స్ మధ్యలో మా ఇంటికొచ్చి నట్లే యాడ్స్ మధ్యలో వంట చేసి తొందరగా పెట్టొచ్చుకదా! వేసవికాలం పిల్లల్ని అలా భోజనం లేకుండా ఉంచేస్తే మంచిదికాదు కదా అనుకుని, ఎవరి అలవాట్లు వాళ్లవిలే అని సరిపెట్టుకున్నాను. కానీ మనసుండబట్టలేక కొద్దిగా పాలుకాచి కప్పుల్లో వాళ్లిద్దరికీ ఇచ్చా. పాలు వేడిగా ఉన్నాయనుకుంటూ చింటూ కప్పు నోటి దగ్గర పెట్టుకుని నోరు కాలి కప్పొదిలేశాడు. అది భళ్లున పగిలిపోయింది.

వాడు నాకేసి భయం భయంగా చూసి ఏడుపందుకున్నాడు.

నేను కంగారుపడలేదు. ఎందుకంటే పిల్లలకి కప్పులు ఖరీదైనవి ఇవ్వడం నాకు నా పిల్లల చిన్నతనం నుంచే అలవాటు లేదు.

నేను సముదాయించలేదు. కనీసం మాట్లాడలేదు.

ఏడుస్తూ వెళ్లిపోయాడు. వెనకే బన్నీ వెళ్లిపోయింది.

★ ★ ★

మర్నాడు వాళ్లిద్దరూ రాలేదు. నా పాచిక పారింది. కానీ హాల్లో కూర్చుని పుస్తకం చదువుకుంటూ మాటిమాటికి పిల్లలు వస్తారేమోనని డోర్ వంక చూస్తున్నాను. ఏదో అనీజీగా అనిపించింది.

వాళ్లు రాకపోతే నాకు ప్రశాంతంగా ఉంటుందని భావించిన నేను వాళ్ల రాక కోసం ఎదురుచూస్తున్నానేంటి? చిత్రంగా అనిపించింది.

ఊరెళ్లారా? లేక ఒంట్లో బాగాలేదా? చూసి రావాలనిపించింది. ఇల్లు తాళం వేసి వాళ్లింటికి వెళ్లాను. నన్ను చూస్తూనే గిరిజ లోనికి ఆహ్వానించింది.

''పిల్లలు ఇవాళ కనపడలేదు'' అంటూ కుర్చీలో కూర్చున్నాను.

''చింటూకి ఒంట్లో బాగులేదక్కా. జ్వరం తగిలింది'' బాధగా అంది గిరిజ. ఆమె అంత ఆప్యాయంగా అక్కా అని పిలవడం గమనించాను. నిన్న జరిగిన సంఘటన స్మృతిపథంలో తళుక్కుమంది. చంటి వెధవల్ని నేను బాధ పెట్టానా? ప్రశ్నించింది నా అంతరాత్మ.

టీవీ ఆన్ చేసి ఉంది. కేవలం బొమ్మలు కదులుతున్నాయి. సౌండ్ రావటల్లేదు. బన్నీ ఒక మూల తల చేతుల్లో అన్చుకుని కూర్చుని ఉంది.

''పిల్లలకి భోజనం చాలా లేటవుతుందట కదా'' యథాలాపంగా అడిగినట్లుగా అన్నాను.

''అవును. వాళ్లు ఏమీ తినరక్కా. ఏది పెట్టినా నాకొద్దు వద్దని ఒకటే గోల. చింటుగాడు మరీ దారుణం. పోనీ నేను చేసిన కూరలు నచ్చవని వైరైటీగా ఉంటుందని పాపం ఆయన హోటల్ నుంచి తెస్తారు. ప్రతీదానికి పేర్లు, పేచీ. లేటయితే, ఆకలేస్తే నోరుమూసుకుని పెట్టినట్లు తింటారనీ..'' సంజాయిషీగా అంది గిరిజ.

''వేసవికాలం కదా. టైంకి తినకపోతే పిల్లలకి వడదెబ్బలూ, ఉడుకుజ్వరాలూ తగులుతాయి'' అన్నాను.

ఆమె మాట్లాడలేదు.


కొంతసేపు పిచ్చాపాటి మాట్లాడి వచ్చేశాను. మనసంతా వికలం అయిపోయింది.

★ ★ ★

బన్నీ, చింటూ హడావుడిగా లోనికి దూసుకొచ్చారు. ఒక్కసారిగా మనస్సుకి తెరిపిగా అనిపించింది. వాళ్లు ఆడుకోవడానికి వాళ్ల వయస్సు పిల్లలు చుట్టుపక్కల లేరని గమనించాను.

టీవీలో కార్టూన్ ఛానెల్ పెట్టాను. వాళ్లు కళ్ళు ప్పగించి టీవీ చూస్తున్నారు. మధ్యమధ్యలో ఇల్లదిరేలా నవ్వుతున్నారు.

లోపలినుంచి కామిక్స్ బుక్స్ తీసుకొచ్చి టేబిల్ మీద పెట్టాను. కొంతసేపటికి బన్నీ బుక్స్ చేతిలోకి తీసుకొని పుస్తకాలు తిరగేస్తూ బొమ్మలు చూస్తోంది. చింటూ కూడా కళ్లు విప్పార్చుకుని చూస్తున్నాడు.



టీవీ ఆఫ్ చేసి ''పిల్లలూ పుస్తకాలు బావున్నాయా?'' అడిగాను.

''బొమ్మలు బావున్నాయి ఆంటీ. ఇలాంటి పుస్తకాలు ఇంకా మీదగ్గర ఉన్నాయా'' అడిగింది బన్నీ.

''బొమ్మలే కాదు, చదివితే ఇంకా బావుంటాయి. కావలసినంత తెలివితేటలు'' అన్నాను.

★ ★ ★

ఇప్పుడూ వాళ్లొస్తారు భోజనం చేసి. పుస్తకాలు అడుగుతారు. నెమ్మదిగా కూడబలుక్కుంటూ చదువుకుంటారు. అర్థం కాకపోతే నేను చెబుతాను. వాళ్లతో పాటు నా వ్యాసంగం కొనసాగిస్తూ ఉంటాను.

చదవడం అనే ఒక విత్తనం మెదడులో నాటితే అది రోజురోజుకీ పెరిగి పెనువృక్షం అవుతుందని నా ధీమా.

ఒక మంచి పని చేశానని తృప్తిగా అనిపించింది.

☆

## అవకాశాల వెల్లువ

**తారలకి ఎలాంటి ఒత్తిడి లేని అవకాశాలు ఇప్పుడు వస్తున్నాయి. హిట్‌లు, ఫట్‌లతో సంబంధం లేని ఇలాంటి అద్భుతావకాశాల్ని వారు బాగానే వినియోగించుకుంటున్నారు. ఇప్పుడు అసిన్ వంతు వచ్చినట్టుంది. వరుస హిట్‌లతో అందర్నీ అలరించిన ఈ కేరళభామ ఇప్పుడు కాల్గేట్, ఫెయిరెవర్, పెప్సీ కోలా, పారాచూట్ కంపెనీలు ఈమెని బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకున్నాయి. దీంతో ఇప్పుడీమె చాలా బిజీ అయిపోయింది.**